77140

# మాస్టారూ టైమ్ ఎంత?

"మేస్టారూ !... టైం ఎంత?"

ఆలోచిస్తూ నడుస్తున్ననేను బ్రేక్ వేసినట్లుగా ఆగిపోయాను. జ్ఞాపకాల పుస్తకంలో పుటలు తిరిగాయి. పిడుగుపడ్డట్టుగా ఉలిక్కిపడ్డాను. మనస్సంతా విషాదంతో నిండింది. ఒక వృద్ధ మూర్తి, పసిపాప కళ్లకుకట్టారు. కెరటాలు విరిగి పడుతున్న చప్పుడు, సముద్రపు హోరు నా చెవుల్లో మార్మోగి, నా చెవులు దిబ్బడేస్తేమోననిపించింది. కళ్లు అశ్రుపూరితాలైనాయి.

"పాపా!" అని నా హృదయం భారంగా మూలిగింది.

"అమ్మ అడగమంటూంది మేస్టారూ!.. టైంఎంత?" తిరిగి అదే కంఠం ప్రతిధ్వనించింది. తెలివి తప్పుతూన్న నా మనస్సును అధీనంలోకి తెచ్చుకుంటూ, అడిగిన ఆ మూర్తి వంక చూశాను. అందాల ఆరు సంవత్సరాల బాలుడు ప్రశ్నార్థకంగా నా వంక చూస్తున్నాడు. ఆనాడు పాప కూడా అలాగే అడిగింది. ఆ కళ్లు అచ్చం పాపకళ్లే. ఆ కళ్లలోని కాంతిని భరించలేక పోయాను. ఆ పిల్లవాడిని పక్కకుతోసి తడబడుతున్న అడుగులతో కొంపలు మునిగిపోతున్నట్లు స్కూలుకేసి పరుగెత్తాను.



కంటి రక్షణకు, సౌందర్యానికి
దర్బార్ కాటుక (రిజిస్టర్డు)





రాంబీర్ కంపెనీ, బొంబాయి-4.




కాల్గేట్ బేబి పౌడరు
ఉత్కృష్టమైనది...మరియు ఇపుడు పెద్ద డబ్బాలో కూడా




ఎక్కువ పౌడరు • తక్కువ ఖర్చు

ఇంగ్లీషు తెలుగు డిక్షనరీ

1200 పేజీలు—300 బొమ్మలు
ఈ డిక్షనరీలోని జెనరల్ ఇన్‌ఫర్మేషన్— సర్వీస్ కమీషన్ వారికిని, హైస్కూలు, కళాశాల విద్యార్థులకును పరీక్షలలో ఉత్తీర్ణులగుటకు ఎంతో తోడ్పడును.
వెల రు. 12/— పోస్టేజి ప్రత్యేకం.

బాలసరస్వతీ బుక్ డిపో,
మదరాసు—1.



కిసాన్
లాంతరు
ఈ రకపువాటిలో ఉత్తమమైనది
అన్ని పెద్ద స్టోర్లలోను లభిస్తుంది
గౌర్ మోహన్ దాస్ & కం.,
233, పాత చైనాబజార్ వీధి, కలకత్తా-1.
ఫోన్: 22-6580.

నిర్జీవంగా క్లాసులోకి అడుగుపెట్టాను. ఆ టెండెన్సు తీస్తున్నంతసేపూ పిల్లల వంక చూడలేదు. అప్రయత్నంగా వస్తున్న అశ్రువులను కొనగోటితో విదిలించి పాఠం మొదలుపెట్టబోయాను. కంఠం దుఃఖంతో పూడుకుపోతున్నది. రెండు చేతులూ తీవిగా వెనక్కు పెట్టుకుని "మేస్టారూ!... టైం ఎంత?" అని ప్రశ్నిస్తున్న చిట్టిపాప కళ్లల్లో మెదలుతున్నది. మేస్టారూ! టైం ఎంత?అనేమాట నా హృదయంలో కల్లోలాన్ని రేపుతున్నది. నన్ను ఏడిపిస్తున్నది. విషపూరితమైన వాడి బాణం గుండెల్లో లోతుగా గుచ్చుకున్నా నాకు బాధ అనిపించదు. పది మంద్రగబ్బలు ఒకేసారి కుట్టినా చిరునవ్వుతో భరిస్తాను. ఆ ఒక్క మాట హృదయంలో కత్తికోతపెట్టి నా గుండెను పిండిచేస్తుంది. పాప, తాత, సముద్రం.. ఇవి మూడూ నా జీవితంలో అగాధాన్ని సృష్టించాయి. వణుకుతున్న పెదవులను అదుపులోకి తెచ్చుకుని జీరపోయిన కంఠంతో పాఠం అయిందనిపించి లేబొరేటరీకి వచ్చిపడ్డాను.

అవుకున్నా దుఃఖం కట్ట తెంచుకుంది. రెండు చేతుల్లో ముఖాన్ని దాచుకుని వెక్కివెక్కి ఏడ్చాను. గతించిన జీవితం జ్ఞప్తికి వస్తే ఏడవక చేసేదేముంది? పాపతోటి పరిచయం, చిన్నప్పుడు నేను సముద్రపు ఒడ్డున గడిపిన రోజులు ఒక్కొక్కటే జ్ఞప్తికి రాసాగాయి....

* * *

తెలుగునాట, ముఖ్యంగా గడియారాలు పెట్టుకున్న ఆసామీలను టైం ఎంత అని అడగడం కొత్తకాదు. ఆశ్చర్యపడవలసినది అంతకన్నాకాదు. మాటికి పదిమంది దగ్గర కూడా వాచీలుఉండవు. అందుకనే "బాబూ, టైంఎంత?" అనో, "మిస్టర్, టైం ఎంత?" అనో అడగడం సర్వ సాధారణం. కాని ఆ ఒక్కమాట వెనకాల ఒక చిన్నారి చిట్టిపాప జీవితగాథ దాగి ఉందంటేమా, ఒక దీనురాలు ఆ మాట విన్నప్పుడు విషాదంగా విలపిస్తుందంటేమా ఎవరైనా నమ్ముతారా?

* * * *

అసలు మా ఊరు విశాఖపట్నం. మా నాన్నగారికి ఆ ఊళ్లోనే ఉద్యోగం. మా ఇల్లు కృష్ణనగర్‌లో సముద్రపు ఒడ్డున ఉండేది. కెరటాల చప్పుళ్లన్నా, సముద్రమన్నా నాకు వెర్రి అపేక్ష. నేను, మా నాన్న అస్తమానూ బీచి ఒడ్డున షికారు చేసేవాళ్లం. సాయంత్రంపూట గంటల కొద్దీ కాలాన్ని బీచ్‌లో గడిపేవాళ్లం. పండు వెన్నెల్లో సముద్రం వెండి ముక్కలు వెదజల్లినట్లుగా ఎంత బాగుండేదనీ! మానాన్న సముద్రం గురించి ఎన్నో కథలు చెబుతుండేవాడు. అప్పుడప్పుడు మా అమ్మకూడా మాతో వచ్చేది. మా నాన్న ఆఫీసునుండి రావడం ఆలస్యమయితే నేనొక్కదాన్నే వెళ్లేదాన్ని... అమ్మ దెబ్బలాడేది నేనొక్కదాన్నే వెడితే. నాన్న చిరునవ్వు నవ్వేవారు.

మా నాన్నకు నే నొక్కదాన్నే సంతానం

**ప్రాణంకన్న మిన్నగా ప్రేమించినవారి క్షేమంకోరి ప్రాణం తీయడానికి వెరవడు మనిషి. తాను లేకపోతే ఏమై పోతారో అన్న చింత కొలది ప్రాణం విడవలేడు. వారి క్షేమానికి భంగం కలగదని నమ్మగలిగితే అలాంటి ప్రాణికి చేకూరే సంతృప్తి అంతా ఇంతా కాదు.**

కావడం మూలంగా తీసుకున్న ప్రత్యేకశ్రద్ధతో బి.ఎస్‌సి. పాసయ్యాను. ఎమ్.ఎస్‌సి. చదువుతానన్నాను. అప్పటికి మేము ఆర్థికంగా చాలా చితికిపోయాము. నాన్నమాట కాదనలేక బి.ఇడి.కి వెళ్లాను. విజయనగరంలో బి.ఇడి. పాసై వచ్చాను. అదృష్టవశాత్తూ రామకృష్ణ మిషన్‌లో నాకు ఉద్యోగం దొరికింది. నేను ఉద్యోగంలో చేరిన రెండు నెలలకు నాన్నకు విజయనగరం ట్రాన్స్‌ఫర్ అయింది. అంతపెద్ద ఇంట్లో నన్ను ఒంటరిగా ఉంచడం నాన్నకు ఇష్టంలేదు. నన్ను ఉద్యోగం మానమన్నారు. నేను ఇష్టపడలేదు. నా సహాధ్యాయిని, ప్రాణ స్నేహితురాలు విజయ యూనివర్సిటీలో ఎమ్.ఎస్‌సి. చదువుతున్నది. తనకు రూమ్‌మేటుగా రమ్మనీ, యూనివర్సిటీ గరల్స్ హాస్టల్లో చేరమనీ ప్రోత్సహించింది. హాస్టల్ జీవితం ఎంతో బాగుంటుందని సంతోషపడ్డాను. అమ్మా, నాన్నగారూ అంగీకరించారు. హాస్టల్లో ప్రవేశించాను. నేను యూనివర్సిటీ విద్యార్థినుల ముందు చాలా ఇన్‌ఫీరియర్‌గా బాధపడేదాన్ని. అందుకనే విజయలేనప్పుడు నేను ఒంటరిగా, మౌనంగా సముద్రంవంక చూస్తూ గడిపేదాన్ని. యూనివర్సిటీ హాస్టలుకూడా సముద్రం వైపే. అందులో మాగది రెండో అంతస్తులో సముద్రంవైపు ఉండేది. ఇంకేం? నాకు చాలా చక్కని కాలక్షేపం. విజయ, నేను ప్రతిరోజూ బీచికి వెళ్లేవాళ్లం. గరల్స్ హాస్టలు ముందున్న బీచి అన్నా, హవామహల్ ముందున్న బీచి అన్నా నాకు అంత ఇష్టంఉండేది కాదు. ఇవి రెండూ దాటి వెడితే, జాలరిపేట వస్తుంది. అక్కడ అయితే మనుష్య సంచారం ఉండదు. పై రెండు బీచిలవద్ద మాత్రం ఊరిలో పని ఉన్నవారూ, పనిలేనివారూఅంతావచ్చేవారు. విజయ ఏదైనా పని ఉండి యూనివర్సిటీ నుంచి రావడం ఆలస్యమయితే నే నొక్కదాన్నే వెళ్లేదాన్ని.

ఆ రోజు యూనివర్సిటీలో వివిధ కాలేజీల మధ్య వక్తృత్వపు పోటీలు, పాటల పోటీలు జరుగుతున్నాయి. విజయ నన్ను రమ్మని ఆహ్వానించింది. కాని నేను వెళ్లలేదు. ఒంటరిగా బీచి వైపు బయలుదేరాను. బీచిలో చాలాసేపు గడిపాను. చెలియలి కట్ట అధిగమించలేక సముద్రుడు చేసే అల్లరి చూచి నవ్వుకున్నాను. ఆ సమయంలో నాకు పచ్చి వేదాంతం ఎవరూ చెప్పని పరమ రహస్యంలాగా బోధపడుతూన్నది.

# గుడిపాటి శాంతాదేవి

చిన్నపిల్లలు గవ్వలు ఏరుతుంటే నేను పందెం వేసి ఏరాను. చేపలు పడుతున్న జాలరివాళ్లతో కొంచెంసేపు మాట్లాడాను. అస్తాద్రి చేరుకుంటున్న సూర్యుని కిరణాలు బంగారు కాంతులతో ప్రసరిస్తున్నాయి. హాస్టలుకేసి బయలుదేరాను.

బీచ్ దాటి రోడ్డుమీదికి వచ్చేసరికి ఒక పాప నా దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చింది. పాప బొద్దుగా బంగారు బొమ్మలాగా ఉంది. పాపకు ఆరేళ్లుకూడా ఉండవేమో!.... పాప నావంక చూచి "మేస్టారూ!... టైం ఎంత?" అని అడిగింది. పాపకళ్లు దేన్నో వెతుకుతున్నాయి. ఎడమచేయి పైకెత్తి టైంచూచాను. పాపకళ్లు సంతృప్తికరంగా మెరిశాయి. టైంచూచి సమాధానం చెప్పకుండా "ఎందుకు పాపా, టైంనీకు?" అని అడిగాను. పాపనోట్లో వేలువేసుకుని ఆలోచిస్తున్నట్లుగా మొగంపెట్టి "మా తాత అస్తమానూ టైం ఎంత అని అడుగుతాడండి. నేను ఎవరినైనా అడిగి తాతకి చెబుతాను" అని పాప సమాధానం చెప్పింది.

ఆలోచిస్తున్న పాపకళ్లు మెరుస్తూ ముచ్చట గొల్పుతున్నాయి. ఆ చిన్నారి కన్నులలో అందాల లోకాలు దివ్యదర్శనం ఇస్తున్నాయి. తన్మయంగా పాపకన్నుల్లోకిచూస్తుండిపోయాను. నాకో చిన్నారి చెల్లెలు లేని లోటు స్ఫురించింది. పాప నా చెల్లెలైతే ఎంతబాగుండేదీ అని గొణుక్కున్నాను. మళ్లీ పాపవేసిన ప్రశ్న నాఆలోచనలకు అంతరాయం కలిగించింది.

"మిమ్మల్నే మేస్టారూ, టైం ఎంత?"

"ఐదూనలభై." సమాధానం చెప్పాను. నన్ను ఒక్క అనుమానం పీడించింది. పాప నన్ను మేస్టారూ అంది. పాపకు నేను మేస్టారిని అని ఎలా తెలుసు?

"పాపా, నన్ను మేస్టారూ అనమని నీ కెవరు చెప్పారు?" అనడిగాను.

పాప గుడ్లు పెద్దవిచేసి నా వంక చూచి "మరి నీ పేరు మేస్టారు కాదేమిటి? నిన్న పెద్ద అబ్బాయిలు నిన్ను మేస్టారూ అంటూంటే విన్నాగా?" అంది.

అవునవును. జ్ఞాపకం వచ్చింది. నిన్న ఇద్దరు రౌడీలు వెంటపడ్డారు. మేస్టారూ అంటూ వెక్కిరింపుగా అనడం కూడా నేను విన్నాను. పాప అది విని ఉంటుంది. పాప గ్రహణశక్తికి ఆశ్చర్యపోయాను.

పాప ఉన్నట్టుండి ఉలిక్కిపడ్డట్టు నా వంక చూచి జాలరి గుడిసెలవైపు పరుగెత్తింది. పాప జాలరి గుడిసెలవైపు వెళ్లడం నాకు ఆశ్చర్యాన్ని

# మాస్టారూ- టైమ్ ఎంత!



వీణావాదిని

చిత్రం—జోసెఫ్ కన్నన్ (మద్రాసు.1)

కలిగించింది. మహారాజు బిడ్డలకు ఉండవలసిన లక్షణాలన్నీ పాప మాటల తీరులోనూ, నిలుచున్న తీరులోనూ—ముఖ్యంగా ఆ కన్నులలోనూ కనిపించాయి. అలాటి పాప జాలరిగుడిసెల్లో ఉండవలసిన ఖర్మ ఏమిటి? ఎందుకోగాని పాప జాలరి గుడిసెల్లో ఉందనే భావన నా కయిష్టాన్ని కలిగించింది. అయితే పాపకు టైం ఎందుకు? మా తాత అడగమన్నాడంది. అయినా తాత ముసలివాడై ఉంటాడు. ముసలివాళ్లకు కాలం తొందరగా గడవదుగా? అందులో ఏదైనా జబ్బు ఉన్న ముసలివాళ్లకయితే, ఛస్తే కాలం గడవదు. తాత కోసం పాప టైం అడిగిందన్నమాట! అంత చక్కని అందాల చందమామలాటి పాప జాలరి గుడిసెల్లో ఉండడమేమిటి? ఏమిటో, కొన్ని క్షణాల క్రితం పరిచయం అయిన పాపను గురించి అంతగా ఆలోచించడం? నా విపరీత మనస్తత్వానికి నాకే నవ్వు వచ్చింది. ఛ! ఛ! ప్రతిదాన్నీ తీవ్రంగా తీసుకోకూడదు. పాప జాలరి గుడిసెల్లోనే ఉండనీ. మధ్య నాకేమిటి బాధ? అనుకున్నాను. కానీ నామనస్సు ఎదురు తిరిగింది. చూచినక్షణంలోనే పాప నా మనస్సును ఆక్రమించేసుకుంది.

ఆలోచిస్తూనే హాస్టలుకు వచ్చాను. అన్యమనస్కంగా భోజనం పూర్తిచేశాను. యూనివర్సిటీ విశేషాలన్నీచెప్పింది విజయ. ఒక్కటీ విన్నట్టు గుర్తులేదు. మర్నాడు క్లాసులో చెప్పవలసిన పాఠం చదువుదామని పుస్తకం తీశాను. చదవ బుద్ధి కాలేదు. వెళ్లి పడుకున్నాను.

ఆ రోజు ఊళ్లోఉన్నస్కూళ్లన్నిటి మధ్యా ఆటల పోటీలు మా హాస్టలులో జరుగుతున్నాయి. విజయ చూద్దాం, ఉండమంది. బీచికి వెడదాం అన్నాను. విజయ కోపంగా మొగంపెట్టి "విన్నడగడం నాదే బుద్ధి తక్కువ" అంటూ విసురుగా వెళ్లిపోయింది. నిన్న కనిపించిన స్థలంలోనే పాప కనిపించింది.

"పాపా, బీచికి వస్తావా?" అని అడిగాను.

"మరి, మా తాతో!" అంది.

"మీ తాత తర్వాత వస్తాడులే. నువ్వురా!" అన్నాను.

"సరే. మేస్టారూ" అంది పెద్ద ఆరిందా లాగా. బీచిలో నేనూ, పాపా చాలాసేపు ఆడుకున్నాము. పిచ్చికగూళ్లు కట్టుకున్నాము. నేను కట్టిన గూళ్లు కొన్ని పడేసి పాప అల్లరిచేసింది. నేను కోపంగా మొగం పెట్టాను. బ్రతిమాలింది.

"మళ్లీ నీకు నేను కట్టిపెడతాగా, అమ్మా!" అంటూ తన చిన్నిపాదం మీద చిట్టి చేతులతో ఇసుకతీసి పొయ్యడం మొదలుపెట్టింది. ముద్దువచ్చింది పాప.

"పాపా, కెరటాల దగ్గరకు వెడదామా?" అన్నాను.

"సరే మేస్టారూ" అంటూ లేచి నిలుచుంది.

పాపా, నేనూ కెరటాలతో చాలాసేపు ఆడుకున్నాము. నేను పాపచేయిపట్టుకున్నాను. కెరటాలు మమ్మల్ని సమీపించినప్పుడు వెనక్కు పరుగెత్తుకుంటూ వెళ్లేవాళ్లం. కెరటంఒడ్డును తాకి విరిగి సముద్రంలో కలిసినపుడు వెంబడించే వాళ్లం. ఒక్కోసారి మేము ఓడిపోయేవాళ్లం. మాకన్నా వేగంగా వచ్చి మమ్మల్ని అందుకునే కెరటాలు. పాపబుగ్గలు సొట్టలు పడేట్టు కిలకిలా నవ్వేది. చివరకు బట్టలు తడుపుకుని అలిసిపోయి ఇసుకలో కూర్చున్నాము. చిరు చీకట్లు కమ్ముకుంటున్నాయి.

"పాపా, ఇంటికి వెడదామా?" అన్నాను.

"అమ్మో! మా తాత!" అంటూ పాప రోడ్డుకేసి పరుగెత్తి జాలరి గుడిసెలలో మాయమయింది.

పాప అంత భయపడడానికి కారణమేమిటో నాకేమీ అర్థం కాలేదు. మర్నాడు కూడా పాపా, నేనూ బీచికి వెళ్లాము. పాప ఈసారి పరుగెత్తలేదు భయంగా.

రోజులు గడిచిపోతున్నాయి. పాపా, నేనూ ప్రాణస్నేహితులం అయాము. పాపతో నాకు చక్కని కాలక్షేపం అవుతున్నది. దసరా సెలవులు ఇచ్చారు. విజయనగరం వెళ్లాను. సెలవులయిన తర్వాత విశాఖపట్నం వచ్చాను. ఆ వచ్చిన రోజు సాయంత్రమే పాపను బీచిలో కలుసుకున్నాను. నన్నుచూచి సంతోషంగా పరుగెత్తుకుంటూ వచ్చి కాళ్లను చుట్టేసుకుంది. పాప బాగా చిక్కిపోయింది. పాపవేసిన మొదటిప్రశ్న: "మేస్టారూ! మీరు రావడంలేదేం...?" అర్థమైంది పాప చిక్కిపోయిన దానికి కారణం. సూదులతో గుచ్చినట్లు బాధ పడ్డాను.

"అమ్మదగ్గరకు వెళ్లాను పాపా!"

"అమ్మ ఎలా ఉంటుంది, మేస్టారూ?" కొయ్యబారిపోయాను. ఈ పాపకు అమ్మలేదా? ఇన్నాళ్లూ పాపనుగురించి వివరాలు సేకరించనందుకు నన్ను నేను శపించుకున్నాను.

"పాపా! మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?" అన్నాను.

"నాన్నా!" గుడ్లు పెద్దవిచేసి నా వంక చూచి "తాత" అంది.

"అదే, మీ తాత ఏంచేస్తుంటారు?" తిరిగి ప్రశ్నించాను.

"మంచంలో పడుకొని దగ్గుతూఉంటాడు."

ఆ చిన్నారి సమాధానం నాకు నవ్వు తెప్పించింది. పాపతో వాళ్లింటికి వెడితే! జాలరిపేట నాకిష్టంలేదు. అక్కడంతా బెస్తవాళ్లు ఉంటారు. పైగా భరించరాని చేపలకంపు. పాప తాతదగ్గుతూ ఉంటాడా! కొంపదీసి ఏ క్షయ రోగపీడితుడన్నా కాదుగదా!

"పాపా, నేను లేనప్పుడు నువ్వేంచేశావు?"

"మరి, మరి ఇక్కడే ఆడుకున్నాగా సాయంతరం" అంది.

నేను లేనప్పుడు కూడా పాప నాకోసం బీచికి వస్తున్నదన్న మాట. పాపకు నామీద ఉన్న ప్రేమకు గర్వపడ్డాను.

ఆ రోజు యథాప్రకారం పాపను కలుసుకున్నాను. పాప కళ్లు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ముఖం చిన్నబోయినట్లుగా ఉంది.

"పాపా! అలా ఉన్నావేం?" అని అడిగాను.

"మరేమో మాతాత చాలాసేపు దగ్గాడు మేస్టారూ! ఎర్రగాఉమ్మేశాడు. అది ఆ-రాములు లేదూ-వాళ్ల మామ్మవచ్చిఓయమ్మోఅనిఏడ్చింది. అంతపెద్ద వాళ్లెక్కడన్నా ఏడుస్తారేంటమ్మా? నాకు నవ్వువచ్చింది. నవ్వేశాను. మామ్మ నన్ను తిట్టి తాత అలా ఉమ్మేస్తే నువ్వు ఏడవాలీ అంది. నేను ఏడవ నన్నాను. అప్పుడుకొట్టింది. నేను ఏడ్చాను. తాత ఉమ్మేస్తే నేను ఏడవాలా మేస్టారూ?" అంది పాప.

నిజమే. సందేహం లేదు. నేను అనుమానించినట్లు పాప తాత క్షయరోగి అయ్యుండాలి. పాప ప్రశ్నలు, అమాయకమైన మాటలు నా హృదయాన్ని చీల్చి చెండాడుతున్నాయి. "పాపా!... మీ ఇంటికి వెడదాం, రామ్మా" అన్నాను. పాప సరేనని తల ఊగించింది. పాపా, నేనూ వాళ్ల ఇంటికి బయలుదేరాము.

పాప ఉన్న గుడిసె జాలరి పేట మధ్యలో ఉంది. ఒక ముసలివాడు మంచంలో పడుకుని ఉన్నాడు. వృద్ధత్వం తాలూకు ముద్రలు, రోగపీడిత లక్షణాలే కాకుండా అతని ముఖంలో వ్యథాభరితమైన విచార రేఖలు ప్రతిఫలిస్తున్నాయి. మా అడుగుల చప్పుడు విని కళ్లు తెరిచి "ఎవరు?" అని ప్రశ్నించాడు.

"మేస్టారు తాతయ్యా" అంది పాప.

నన్నుచూచి జీవంలేని చిరునవ్వు నవ్వి "రండమ్మా, రండి" అని సాదరంగా ఆహ్వానించి పక్కనే ఉన్న స్టూలు చూపించి కూచోమన్నాడు.

"మా పాప మీ గురించి ఎప్పుడూ చెబుతూ ఉంటుందమ్మా. నా అనుమతిలేకుండా నా చిట్టితల్లి ఎక్కడికీ వెళ్లదు. మీ దగ్గరకు వెళ్తానని రోజూ మారాం పెడుతూంటే నేను వెళ్లమన్నాను."

తాత మాటాడే ప్రతిమాటా ఎంతో పొందికగానూ, స్వచ్ఛంగానూ ఉంది. తాతలో ఉన్నత సంస్కారం ఉట్టిపడుతున్నది. పల్లెవాడలో ఇంత సంస్కారవంతులు ఉండడం సాధ్యమా? తాత అమ్మను గురించి, నాన్నను గురించి, నా గురించి ఎన్నో విషయాలు అడిగాడు. అన్నిటికీ ఓపికగా సమాధానం చెప్పాను.

చివరకు ధైర్యంచేసి అడిగాను: "మీరుచూస్తే బెస్తవారుగా కన్పించలేదు. ఇక్కడ ఉండడానికి కారణమేమిటి?"

నేను అడిగిన ప్రశ్నకు ఆ వృద్ధుని కళ్లనుంచి

(తరువాయి 53 వ పేజీ)

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా? తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స ఎంతమాత్రము కాలయాపనచేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారితీసి-శస్త్ర చికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి, ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేపనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు. హెడెన్‌సా శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది-విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు. హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు సామర్థ్యంగా గుణాన్ని కలిగించి రక్త శంకలను ముకుళింప జేసి ఆరోగ్యకరమైన టిష్యూ రంధ్రాల ప్రవృద్ధికి సహకరిస్తుంది. గమనించండి. మూల శంకలకు సకాలంలో హెడెన్‌సా చికిత్స చేసుకుంటే మున్ముందు శస్త్ర చికిత్స అవసర ముండదు!

హెడెన్‌సాలో మత్తును కల్గించే మందులు ఏమియు లేవు.

అసలైన జర్మన్ సూత్రాలకు అనుగుణంగా ఇండియాలో వీరిచే తయారు చేయబడుచున్నది.

దీ డాలర్ కంపెనీ
337, తంబుచెట్టి స్ట్రీటు
మద్రాసు-1.

ప్రసిద్ధి పొందిన కెమిష్టు లందరివద్ద లభిస్తుంది.

B3-DOL-2TG

# మాస్టారూ— టైమ్ ఎంత!

(13వ పేజీ తరువాయి)

రెండు వేడి బొట్లు రాలాయి. రుద్ధ కంఠాన్ని సవరించుకున్నాడు.

"అదంతా ఒక చరిత్ర అమ్మా!" అన్నాడు.

ఈ లోగా తాతకు దగ్గు తెర వచ్చింది. ఊపిరి తిప్పుకొని తిరిగి చెప్పడం మొదలు పెట్టాడు.

"పల్లెలో అజ్ఞాతంగా తలదాచుకునే నా చరిత్ర విని ఎవరైనా సానుభూతి చూపుతారా అమ్మా! కానీ..... ఈ రోజు నీకు చెప్పాలనిపిస్తున్నది. చెబుతాను."

ఆ తాత చెప్పిన మాటల్లోని సారాంశం ఇది:

తాత బాగా చదువుకున్నవాడు. ఆస్తిపరుడు. తాతకో కొడుకు. కొడుకు పుట్టిన కొద్దిరోజులకే తాతకు భార్యావియోగం సంభవించింది. సమస్తాశలు కొడుకుమీద పెట్టుకొని తల్లీ, తండ్రీ తానే అయి కొడుకును అతిగారాబంగా పెంచాడు. తాత కలలు ఫలించి కొడుకు పైలట్ ఆఫీసరుగా సెలక్టు అయాడు. ఒక దిక్కూ దివాణం లేని పిల్లను, అందాల బరిణను ఏరి కొడుక్కు పెండ్లి చేశాడు. మళ్లీ ఏడాదికి బంగారు బొమ్మలాంటి మనుమరాలు పుట్టింది. తన జీవితంలో ఇక చీకూ చింతా లేదని తాత మురిసిపోయాడు.

పరిపూర్ణ సుఖము అధిక బాధలకొరకే అన్నట్లుగా విమానం కూలి కొడుకు మరణించాడనే వార్త పిడుగుపాటులాగా తగిలింది. కన్న కలలన్నీ కూలిపోయాయి." ఎలా బ్రతకాలి? ఏం చూసుకు బ్రతకాలి? బ్రతికిమాత్రం ప్రయోజనమేముందీ?.... చచ్చిపోతే!" పాప రోదన ధ్వని తాతచెవుల్లో పడింది. పాపను హృదయానికి హత్తుకుని వలవలా ఏడ్చాడు. కొడుకులేని ఆ ఇంట్లో ఉండడం దుర్భరం అనిపించింది. పసిపాప ముద్దు మోములో కొడుకు పోలికలు కొట్టవచ్చినట్టుగా కనిపిస్తున్నాయి. భరించరాని ఆ దుఃఖపూరిత వాతావరణంలో పాప చిరునవ్వులు కొంచెంగా ఉపశమనాన్ని ఇస్తాయి అనుకొన్నాడు. నాలుగైదునెలలు గడిచాయి.

కోడలి ప్రవర్తనలో మార్పు కనిపించింది. కొడుకుతో పనిచేసిన సుందర్ అస్తమానూ తమ ఇంటికి వస్తున్నాడు. కోడలు సుందరంతో మాట్లాడినపుడు ఒళ్లు భగ్గున మండేది. చివరకు ఒకసారి సుందర్‌తో సినిమాకు కూడా వెళ్లింది. దిక్కూ దివాణంలేని పిల్లని, పేద పిల్లని జాలిపడి చేసుకున్నందుకు బాగానే బుద్ధి చెబుతున్నది. చెట్టంత కొడుకు చచ్చి, పుట్టెడు దుఃఖంతో తను బాధపడుతుంటే దానికి ఈ వేషాలన్నీనా! అని తాత కోడలిని ద్వేషించడం మొదలుబెట్టాడు.


ఒకరోజు తాత చల్లగాలికోసం బయటకువెళ్లి వచ్చేసరికి కోడలు, సుందర్‌ల నవ్వులు వినిపించాయి. ఒళ్లు మండింది. ఇలాటి పరువు తక్కువదాన్నిఏంచేస్తే పాపముంటుంది?అనుకునీ, శాంతం వహించాడు. క్షణంసేపు యోచించాడు. తన అబ్బాయి దగ్గర ఒక రివాల్వరు ఉండేదని జ్ఞప్తికి వచ్చింది. గబగబా గదిలోకి వెళ్లి పట్టుకు వచ్చాడు. సుందర్ వెళ్లేదాకా వేచిఉన్నాడు. నిర్దాక్షిణ్యంగా కోడలిని కాల్చేశాడు. మరుక్షణంలో తాతకు జ్ఞాపకానికి వచ్చింది, విధి తండ్రిని పొట్టన పెట్టుకుని పాప నన్యాయంచేస్తే, తను తల్లినిచంపి అనాధగా చేశానని. పాపను కౌగలించుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. సంకెళ్లు, జైలు, పోలీసులు మనస్సులో మెదిలారు. అంతేకాదు, తను లేకపోతే తన పాప నెవరుచూస్తారు?కర్తవ్యం స్ఫురించింది. పెట్టెలో ఉన్న డబ్బంతా మూట గట్టుకుని పదినెలల చంటిపాపను చంకనవేసుకొని పరారీ అయ్యాడు. పోలీసులు తనకోసం వెదుకుతున్నారని ఎప్పటికప్పుడు పేపర్లో వార్తలవలన తెలుసుకుంటూనే ఉన్నాడు. చివరకు ఈ పల్లె గుడిసెలో పల్లెవాడుగా ఉంటూ అజ్ఞాతంగా జీవిస్తున్నాడు. అతి చిత్రమైన జీవితం గడుపుతున్నాడు.

ఆపకుండా వచ్చింది దగ్గుతెర తాతకు. తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు. "అమ్మా, ఈ నా పాప నాసర్వస్వం. నా పాపబంధంలేకపోతే నేనీ ప్రపంచాన్ని ఏనాడో వదిలిపెట్టేవాడిని. పాప పేరున రెండువేల రూపాయలు దాచాను. క్షయరోగం నన్ను పూర్తిగా తినేసింది. నేనెన్నాళ్లో జీవించను. నా చిట్టితల్లి అనాధ అయిపోతుంది. ఎవరు చూస్తారు నా తల్లిని?" ఆపుకోలేని దుఃఖంతో తాత వెక్కివెక్కి ఏడ్చాడు. నా కళ్లు వర్షించాయి. కళ్లు తుడుచుకొనిచివరకు స్థిరంగా అన్నాడు, పాపను అనాథాశ్రమంలో చేర్పిస్తానని. తాత ఆ మాట అనేసరికి నాకు దుఃఖం వచ్చింది. తాత దగ్గరినుంచి సెలవు తీసుకొని హాస్టల్‌కు వెళ్లాను.

ఆనాటినుంచీ ప్రతిరోజూ తాత యోగక్షేమాలు విచారించడం, పాపతో ఆడుకోవడం నా నిత్య కార్యక్రమం అయిపోయింది. ఎన్నో సాయంత్రాలు తాతదగ్గర కూర్చుని గడిపాను. అలాటి సమయాల్లో పాప నా ఒళ్లో పడుకుని నా ముంగురులు రేపుతూ చిలిపిగా అల్లరి చేసేది.

పాపకు నావద్ద సాన్నిహిత్యం పెరిగింది. తాత నన్ను పల్లెవాసులకు పాప ప్రైవేటు పంతులమ్మగా పరిచయం చేశాడు. తాతకీమధ్య మరీ దగ్గు ఎక్కువైంది. దగ్గు తెర వచ్చినప్పుడు గుక్క తిప్పుకోలేకపోతున్నాడు. అప్పుడప్పుడు రక్తం కూడా పడుతున్నది. నేనుడాక్టరునుపిలుస్తానంటే ఒప్పుకోలేదు. పల్లెవాడలో ఉన్న నాటువైద్యుడే చూస్తున్నాడు.

ఆ రోజు నాన్నగారి దగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది అమ్మకు ప్రమాదకరంగా ఉందనీ, వెంటనే ఉన్నపళంగా బయలుదేరి రమ్మనమనీ.



అభ్యంజనం

చిత్రం—వి. శశి (పేకేటిపాలెం)

# నేతలో, మన్నికలో పనితనంలో

# కొఠారీ మల్లులు

## విశిష్టమైనవి లాంగ్‌క్లాత్‌లు కూడా।

... ఎందుకంటే

- కొఠారీ మల్లులు మరియు లాంగ్‌క్లాత్ బట్టల తయారీకి ఉపయోగింపబడిన నూలు ఉత్తమ రకపు కొఠారీ నూలు.
- వాటింతటవే తిరిగే ఆటోమాటిక్ లూములమీద నేసిన బట్ట నేత బాగా ఉంటుంది.

**ఎప్పుడూ కొఠారీ మల్లు M-7 మరియు అదే పేరుతో లాంగ్‌క్లాత్ L-1 లేక L-2 అడగండి.**

ఈ ట్రేడ్ మార్కుని గమనించండి




తయారుచేసినవారు:
కొఠారీ టెక్స్‌టైల్స్ లిమిటెడ్
సింగనల్లూరు, కోయంబత్తూరు.
భారతీయ మానక్ సంస్థ సర్టిఫయింగ్ మెంబర్లు.
మేనేజింగ్ ఏజెంట్లు:
కొఠారీ & సన్స్, ఓరియంటల్ బిల్డింగ్స్, అర్మేనియన్ స్ట్రీటు, మద్రాసు-1.



ASP/GM/23 TEL

పళ్లు రావటమా?
వాతమా?
కడుపు నొప్పా?



# మేనర్స్

## గ్రైప్ మిక్‌శ్చర్

యివ్వండి
చిరునవ్వుల
చిందులాట చూడండి






**ఇప్పుడు**
ఉల్లాసకరమైన
ఎరుపు పీలిరంగుల్లో
ప్యాకింగ్

అధునిక తల్లులు తమ పిల్లలకు మేనర్స్ గ్రైప్ మిక్‌శ్చర్ యిస్తారు. నోటికి యింపైన రుచి పరిశుద్ధముగా ప్యాక్ చేయబడినది.

అదృష్టపాపలు పొందుతారు మేనర్స్ గ్రైప్ మిక్‌శ్చర్

GEOFFREY MANNERS & COMPANY LIMITED

నా గుండెలు దడదడలాడాయి. విజయ ధైర్యం చెప్పి బస్సు ఎక్కించింది. ఇంట్లో ప్రవేశించే సరికి అమ్మ చిక్కిపోయి మంచంలో పడుకుని ఉంది. నన్నుచూచి కళ్ల నీళ్లు పెట్టుకుంది, "అమ్మా శాంతీ, నిన్ను ఒక ఇంటిదాన్ని చెయ్య లేక పోయానమ్మా" అంటూ. అమ్మ ఒళ్లో తలదాచుకున్నాను. తర్వాత నాన్నగారు చెప్పారు ఆ క్రితంరోజే తాతమ్మ మూసినకన్ను తెరవలేదట. మృత్యుముఖంనుంచి బయటపడిం... విపరీత మైన డిసెం్ర టీట. "శాంతీ! శాంతీ!" అంటూ మగతగా ఒకటే కలవరింతలట. నాన్న ఆగలేక టెలిగ్రాం ఇచ్చారట. నాలుగు రోజులు అమ్మ దగ్గర ఉన్నాను. అమ్మకు నామీదెంత బెంగో అర్థమయింది. అమ్మకు పాపకథంతా చెప్పి "పాపని మనింటికి తెచ్చుకుందాం అమ్మా!" అన్నాను. అమ్మ వెంటనే సంతోషంగా అంగీక రించింది. నాన్న మొదట ఒప్పుకోలేదు. కాని, అమ్మ నచ్చచెబితే నాన్న సరేనన్నారు. అమ్మనాలుగు రోజుల్లో కోలుకుంది.

నేను ఉత్సాహంగా విజయనగరం నుండి వచ్చాను. పొద్దున్నే స్కూలు ఎలాగో అయిందని పించి, హుషారుగా పాప ఇంటికి వెళ్లాను. రోజూ నాకోసం ఎదురుగా ఉత్సాహంగా వచ్చే పాప కనిపించలేదు. ముసలితాతదగ్గు వినిపించలేదు. గుడిసె సమీపించే కొద్దీ గుండెలు కొట్టుకోవడం మొదలు పెట్టాయి. నన్ను అంతదూరంనుంచి చూస్తూనే కొంతమంది బెస్తవాళ్లు పరుగెత్తు కుంటూ వచ్చారు.

"అమ్మాయిగోరూ!. . . తాత మొన్న పొద్దున్న సచ్చిండు. తాత సచ్చిన తర్వాత యారి తోనూ మాట్టాడనేదు పిల్ల. మొన్న సాయంత్రం యాడకెల్లిందో ఎరుకలేదు. ఆడుకుందికేమో నమకొన్నాం. యాడకు బోయిందో ఆ రాత్రి రాలేదు. నిన్న తెల్లోళ్లయిళ్లకాడ శవం తేలిందని సూడబోతిమి. సూత్తే ఈ పిల్లా!"

నోటివెంట మాటరాక గుడ్లు అప్పగించి చూస్తుండిపోయాను. నా మనస్సు స్తబ్ధమై చలనరహితమైంది. ఈలోగా మరొక పల్లె పడుచు "తాత మీకు ఇదీయమన్నాడు" అంటూ ఒక పాసుబుక్కు, ఒక కవరు ఇచ్చింది. కవరు అప్రయత్నంగా తెరిచాను. తాత నాకే వ్రాశాడు.

"అమ్మా! శాంతీ,

నా చివరి రోజులలో శాంతిని ప్రసాదించా వమ్మా ! నా చిన్నారి చిట్టిపాపను నీకు వదిలి ఈ దుఃఖమయ జీవితానికి స్వస్తిపలికి వెళ్లి పోతున్నానమ్మా. పాపను గురించి ఇంక నాకే చింతా లేదమ్మా. పాప బాధ్యత నిర్వహించలేనను కుంటే పాపను అనాధాశ్రమంలో చేర్పించమ్మా. ఈ డబ్బు నీ ఇచ్చవచ్చినట్లుగా ఉపయోగించు. దేవుడు నీకు మేలు చేస్తాడమ్మా.

—తాత."

పాపా!...ఇంకెక్కడి పాప ! నన్ను వదిలి వెళ్లిపోయావా పాపా! తాత నాకప్ప జెప్పాడమ్మా. నువ్వు నా చెల్లివి. పట్టరాని దుఃఖంతో, భరించ రాని ఆవేదనతో పొంగిపొర్లుతున్న ఏడుపుతో వెళ్లి బీచిలో పడ్డాను. భోరున ఏడ్చాను. అలా ఎంతసేపు ఉన్నానో నాకు తెలియదు. పాప బీచికి ఒంటరిగా రావడానికి కారణమేమిటి? నాకోసమే. ఇదివరకు పాప అలా వచ్చిందని తెలిసినపుడు గర్వపడ్డాను. ఆరోజే పాపను మంద లించినట్లయితే ఇలా వచ్చేదా? ఊరువెళ్లే ముందు పాపతో చెప్పానా? లేదు. అయితే హంతకిని నేను. అయ్యో! తాతా! శాంతిని ప్రసాదించిందని నీవు సంతోషపడ్డ ఈ శాంతి చిట్టిపాప మరణానికి కారకురాలైంది. తాతా! నువ్వు మళ్లీ వచ్చి పాపేదని అడిగితే నేనేం సమాధానం చెప్పను? హృదయం పగిలిపోయేట్టు ఏడ్చాను. నా కళ్లల్లో నీళ్లు అయిపోయేదాకా విలపించాను. తల ఎత్తి చూచాను. ఎదురు గుండా సముద్రం నా—చిట్టిపాపను, నా చెల్లిని మింగిన సముద్రం భయంకర రాక్షసిలాగా అరుస్తున్నది. ఏ సముద్రం ఒడ్డున నా బాల్య జీవితం స్మృతిమధురంగా గడిపానో, ఏ సముద్రం ఒడ్డున నిరంతరం తిరిగానో ఆ సముద్రం నా బంగారు చెల్లిని మింగింది.

సముద్రమంటే ఇదివరకుఉండే వెర్రి ఆపేక్ష స్థానంలో ద్వేషం నిండుకుంది. తెరలు తెరలుగా దుఃఖం ఉప్పొంగింది. కసిగా, ద్వేషపూరితంగా సముద్రంవంక చూచాను. తరంగాలు హేళనగా నవ్వుతున్నాయి. అసహ్యంగా వాటివంక చూచి పరుగెత్తుకుంటూ వచ్చి హాస్టల్లో పడ్డాను. ఆనాటినుండీ సముద్రం ఒడ్డుకు వెళ్లలేదు. విశాఖపట్నం పరిసరాలు నాలో ఆవేదనను ద్విగుణీకృతం చేస్తున్నాయి. పాప డబ్బు పాప పేర ఆశ్రమానికి ఇచ్చేశాను. రిజైనుచేసి ఇంటికి వచ్చాను. రెండు నెలలు ఎవరితోనూ మాట్లాడ కుండా శూన్యంలోకి చూస్తూ కాలం గడిపేశాను. నా వాలకంచూచి అమ్మ, నాన్నగారు భయ పడ్డారు. నాన్న పట్టుదలవల్ల ఒక పల్లెటూరులో ఉద్యోగంలో ప్రవేశించాను.

ఆనాటినుంచీ నాకు వృద్ధులంటే భయం. ఏ తాతనుచూచినా నా పాపేదీ అని ఆ వృద్ధుడు ప్రశ్నించినట్లుగా బాధపడతాను. నా పాపను పొట్టనబెట్టుకున్న సముద్రమంటే నాకు అంతు లేని అసహ్యం. ఈనాటికీ ఆ నాటికీ బీచికి వెళ్లలేదు. వెళ్లను. పసిపాపలను చూస్తే చాలు; నా చిన్నారిపాప జ్ఞాపకానికి వచ్చి దుఃఖం ద్విగుణీ కృతమవుతుంది. అందుకే వాళ్లవైపు చూడను. వాళ్లతో మాట్లాడను.

"మేస్టారూ! టైం...ఎంత?" అనే మాట లతో పరిచయమైన పాప జీవిత గాథ ఆ విధంగా ముగిసింది.

మానుతున్న గాయం ఒక బాలుని ప్రశ్నతో మళ్లీ రేగినపుడు ఏడడక నే చేసేదేముంది? "శాంతిలేని ఈ జీవితాన్ని ఎన్నాళ్లు గడపాలి ప్రభూ" అని భగవానుడిని చేతులు జోడించి ప్రశ్నించడం మినహా ఏంచేయగలను? ★


## క్లియరెన్సు అమ్మకం

మిక్కిలి ఆకర్షణీయమైన రంగులలో అంద మైన, అతి నవీనమైన డిజైను చేనేత చీరెలు: 1 చీర రు. 7/50, 2 చీరెలు రు. 14/—, 3 చీరెలు రు. 20/—. డీలక్సు రకం: 1 చీర రు. 11/—, 2 చీరెలు రు. 21/—, 3 చీరెలు రు. 30/—. స్పెషల్ రకం: 1 చీర రు. 15/—, 2 చీరెలు రు. 28/—, 3 చీరెలు రు. 39/—. పోస్టేజి, ప్యాకింగ్ ఉచితం. ఏరెండుచీరెలతోనైనను ఒక జత చెవి కమ్మలు ఉచితం. ఏ మూడు చీరెలతోనైనను ఒక జత చెవి కమ్మలు, జాకెట్టుముక్క ఉచితం. ఆశాభంగం పొందకుండుటకు వెంటనే మీ అడ్రసు ఇంగ్లీషులో తెల్పుతూ వ్రాయండి.



PARIS COMMERCIAL CO. (APW-3)
Post Box No. 1804, Delhi-6.



## శుభవార్త

డాక్టర్లకు సాధ్యంగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును.

మధుమేహము, రక్తపు పోటు. కుష్టు.బొల్లి. కేన్సర్ క్షయ. సంతానము లేనివారు గూడ శ్రీ యోగి గారి చికిత్సవలన సంపూర్ణఫలమును బడయగలరు.

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్సవల్ల దేహములో వున్న వ్యాధులు తొలగి పోవుటయేగాక నూతన యవ్వనము కలుగును వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు ఒక రూపాయి పంపవలయును

శ్రీ యోగాశ్రమము,
పి. ఓ. పెదవాల్తేరు, విశాఖపట్టణము.